క్లుప్తంగా

ఆలయ కమిటీ చైర్మన్‌గా కుమార్‌రెడ్డి



భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా రెండో సారి గడ్డం కుమార్‌రెడ్డిని నియమిస్తూ దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్స్ అఫిషియోగా డింగిరి మురళీకృష్ణ, డైరెక్టర్లుగా నాగపురి సమ్మయ్యగౌడ్, గుగులోతు రాజు, దరిపల్లి వెంకటలక్ష్మి, గురిజాల శ్రీనివాస్, పనుగంటి రమేష్, గజ్జె శ్యాంకుమార్‌లను నియమించారు. నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం



భూపాలపల్లిరూరల్: ప్రమోషన్‌పై డిప్యూటీ పర్సనల్ మేనేజర్‌గా భూపాలపల్లి జీఎం కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న వెల్ఫేర్ ఆఫీసర్ గుండు రాజును కేటీకే 5 ఇంక్లైన్ గని ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కమిటీ మెంబర్ ఎండీ అబ్దుల్ ఆసిఫ్ పాషా, ఫిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి, యూనియన్ నాయకులు భోగ రమేష్, ఎండీ గౌస్, చంద్రయ్య, కుమార్ స్వామి, సదయ్య తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన బండి అపర్ణ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వైద్య ఖర్చుల నిమిత్తం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబును కుటుంబ సభ్యులు సంప్రదించగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు శ్రీధర్‌బాబు హైల్త్ టీం సభ్యుడు సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

21న స్పాట్ అడ్మిషన్లు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించి 21వ తేదీన అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివకల్యాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఈపీ (బీఏ హెచ్ఈపీ), బీఎస్సీ (బీజెడ్సీ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీకాం (సీఏ) కోర్సుల్లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థినులు సర్టిఫికెట్లతో పాటు పాస్‌పోస్టుసైజ్ ఫోటోలు, ఇంటర్ టీసీ, ఇతర పత్రాలతో ఈనెల 20వ తేదీ లోపు కళాశాలలో సమర్పించాలని తెలిపారు. అలాగ్ దోస్త్ ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకొని ఉండాలని సూచించారు. 21వ తేదీన స్పాట్ అడ్మిషన్లు ఇస్తామని వెల్లడించారు. 8978905817, 9550476026 సంప్రదించాలన్నారు.

రోడ్డు నిర్మాణమెప్పుడో?

- కలగానే.. బీటీ రోడ్డు ఏర్పాటు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



వర్షానికి బురదమయమైన మట్టిరోడ్డు

మల్హర్: మల్హర్ మండలం తాడిచర్ల నుంచి పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి మానేరు వంతెన వరకు రెండు కిలోమీటర్ల మేర ఉన్న మట్టి రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మాణం కలగానే.. మారుతోంది. ఓపెన్‌కాస్ట్ విస్తరణలో భాగంగా గతంలో ఉన్న డబుల్ రోడ్డుని ఓసీపీ అధికారులు తొలగించారు. ఇందులో భాగంగా ఓసీపీ ప్రాజెక్టులోకి వదర నీరు రాకుండా ఉండడానికి మూడు కిలోమీటర్ల మేర బండ్(కరకట్ట) నిర్మాణం చేపట్టి, వంతెన వరకు బీటీ రోడ్డు నిర్మించాలని జెన్‌కో అధికారులు ప్రతిపాదనలు చేశారు. బండు నిర్మాణం పూర్తియి సంవత్సరం గడుస్తున్న ఇప్పటికీ బీటీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో మట్టి రోడ్డుపై ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చినుకు పడితే చిత్తడే

తాడిచర్ల ఊర చెరువు నుంచి బ్రిడ్జి వరకు రెండు కిలోమీటర్ల మేర ఉన్న మట్టి రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. ఈ రహదారి గుండా తాడిచర్ల–మంథని వైపు నిత్యం వందలాది వాహనాల రవాణా కొనసాగుతుంది. ప్రస్తుతం వర్షకాలం కావడంతో వర్షం కురిసినప్పుడల్లా మట్టి రోడ్డు అంతా బురదమయంగా దర్శనమిస్తుంది. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న క్రమంలో వాహనాలు జారీ పడి, ప్రమాదం జరిగే అవకాశం ఉందని ద్విచక్ర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గతంలో మట్టిపై తెలిపిన రాళ్ల కారణంగా సైతం కింద పడి గాయాలపాలయ్యాని సందర్భాలు ఉన్నాయని పలువురు వాహనాదారులు వాపోతున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



తాడిచర్ల ఊర చెరువు నుంచి మానేరు వంతెన వరకు మట్టి రోడ్డుపై వర్షం కురిస్తే బురదమయంగా మారుతుంది. బురద రోడ్డుపై పొలాలకు బైక్‌పై వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మట్టి రోడ్డుపై ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలి.

– ఆకుల వెంకటస్వామి, రైతు, తాడిచర్ల, మల్హర్

బీజేపీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

టేకుమట్ల(రేగొండ): బీజేపీ కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేస్తే నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగరవేయడం ఖాయం అని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణంలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో భాగంగా టిఫిన్ డబ్బా ఇష్టగోష్టి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చందుపట్ల కీర్తిరెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి నెల ఒక రోజు కార్యకర్తతో కలిసి భోజనం చేయడం మూలంగా పార్టీ వ్యవస్థ బలపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, రాష్ట్ర నాయకులు నాగపూరి రాజమొగిలి, వెన్నెంపల్లి పాపన్న, చదువు రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, సామల మధుసూదన్, చెవ్వ శేషగిరి, దేశెట్టి గోపాల్, నాయకులు మోర్తెల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఏటూరునాగారం: గ్రామంలోని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని రామన్నగూడెం సర్పంచ్ దొడ్డ కృష్ణ కోరారు. సోమవారం రామన్నగూడెంలోని ప్రతీ ఇంటికి మొక్కలు అదించారు. ఉసిరి, మునిగ, సీతాఫలంతో పాటు పలు రకాల పండ్ల మొక్కలను అందజేశారు. అదే విధంగా 2500 మొక్కలను కరకట్టకిరువైపున నాటినట్లు సర్పంచ్ వెల్లడించారు. పల్లెలు పచ్చని చెట్లతో మెరిసిపోయేలా హరితహారం కింద వన్ జీపీ నర్సరీలో 6వేల మొక్కలను పెంచామన్నారు. ఈ కార్యక్రమంలో రఘు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ పాత రోజులే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ పాత చికటి రోజులే వస్తాయని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ రఘుపతిరావు, ఎంపీపీ మండల లావణ్య సాగర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నేరేడుపల్లి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ కాలంలో ఏడు గంటల కరెంటుతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మూడు గంటల కరెంటు ఇస్తే పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సాగు నీటి కోసం 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్పటం రైతులను మోసం చేయటమేనని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్ధు, సర్పంచ్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



చిట్యాల: ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు



కాళేశ్వరంలో..

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన పంబాల సంపత్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మిట్టపల్లి మిత్ర మండలి ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించారు. అనంతరం బియ్యంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్ల సతీష్ కుమార్, సభ్యులు పుల్ల సుమన్, మాసు రమేష్, గురుకుంట్ల కిరణ్, జన్నే యుగేందర్, కట్కూరి రాజేందర్, వెల్పుల రాజ్‌కుమార్, పుల్ల శైలందర్, మాసు రాకేష్, పుల్ల చందు, సంజయ్, భిక్షపతి, మొలుగూరి రాకేష్, గుర్రపు అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన పిట్టల శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ లోకుల పోషక్క వంట సామగ్రి అందజేశారు. ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. అలాగే ఏఎస్సై రాజేశం రూ.1000 ఆర్థిక సాయం అందించారు. వారి వెంట రవీందర్‌రెడ్డి, పోశం, కావేరి సమ్మయ్య ఉన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన



చిట్యాల: భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు



మహాముత్తారం: సమ్మెలో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది

కాటారం: గ్రామ పంచాయతీల కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో భిక్షాటన చేసి, ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ప్రధాన కూడలిలో ప్రయాణికులు, బాటసారులతో పాటు వ్యాపార దుకాణాల వద్ద భిక్షాటన చేస్తూ వారి దుస్థితిని విన్నవించారు. మండల కేంద్రానికి చెందిన వేముల శ్రీశైలం స్మారకార్థం ఆయన సోదరుడు వేముల బొర్రాజు కార్మికులకు అన్నదానం చేశారు. కార్మికుల సమ్మెకు ఎంపీపీ పంతకాని సమ్మయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కార్మికులు 12 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తోట రాధమ్మ, రమేశ్‌రెడ్డి, వేముల బొర్రాజు, కార్మికుల సంఘం నాయకులు దోమల శ్రీనివాస్, మెండ మల్లేశ్, కొండయ్య, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం 12 వ రోజు సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ మేరకు కార్మికులు భిక్షాటన చేసి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాజేందర్, కుమార్, యుగేందర్, సతీష్, సమ్మక్క, మొగిలి, కరుణాకర్, నరేష్, శంకర్, దేవేందర్, రాకేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారానికి 12వ రోజు చేరింది. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెలో పాల్గొని తమ డిమాండ్లను నెరవేర్చాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి : తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని జీపీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 12వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

వాజేడు: తమ డిమాండ్లను నెరవ్చేరాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు సోమవారం భిక్షాటన చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. మండల కేంద్రంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లి భిక్షాటన చేశారు.

వెంకటాపురం(కె): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 12 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మానవహారంగా నిర్వహించి వినూత్నంగా నిరసన తెలిపారు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 12వ రోజు కొనసాగింది. పంచాయతీ కార్యదర్శి అశోక్ ప్రైవేట్ లేబర్ ద్వారా చెత్తను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న పారిశుద్ధ్య జేఏసీ కార్మికులు వారిని అడ్డుకున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి, కార్మికులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యదర్శి అశోక్ పోలీసులను ఆశ్రయించారు. గ్రామంలో పారిశుద్ధ్యం పేరుకుపోయిందని, పనులను అడ్డుకోవద్దని పోలీస్‌లు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని పారిశుద్ధ్య కార్మికులు హెచ్చరించారు. స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి కార్మికులతో మాట్లాడి ధర్నాకు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు వెంకన్న, మినాజ్ ఉన్నారు.

'విమర్శించే హక్కు లేదు'

వెంకటాపురం(ఎం): ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ప్రతిపక్షాలకు లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, మండల అధికార ప్రతినిధి ముడిగె రాజ్‌కుమార్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడమే కాకుండా విత్తనాలు, ఎరువులు కూడ దొరకలేదని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే రైతులకు, ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థినేనని, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల మాటలను నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు.

మల్చింగ్ షీట్ అమ్మకం


వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక సహకార సంఘం ద్వారా మల్చింగ్ షీట్, తైవాన్ పంపులను విక్రయిస్తున్నట్లు సీఈఓ సోమ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని రైతులకు సోమవారం 2 తైవాన్ పంపులు విక్రయించామని, తక్కువ ధరకే మల్చింగ్ షీట్ కూడా లభిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



వాజేడు: మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన అనుముల కృష్ణారావుకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. కొంగాల వాగు సమీపంలో పచ్చిక కోసం వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు. గేదె విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని తెలిపారు.

ఉద్యమకారుల మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన మండల కమిటీ సభ్యులు

మంగపేట: తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా నాయకుడు పప్పు వెంకట్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. ఉద్యమకారుల స్థితిగతుల సమావేశం నిర్వహించి గతంలో కోరిన విధంగా ఉద్యమకారులకు నెలకు రూ. 5000 పింఛన్, హెల్త్ కార్డు, కుటుంబ ఆరోగ్య పరిస్థితులను బట్టి ఉచిత బస్‌పాస్, ప్రభుత్వ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యకారుని జీవన భృతి కోసం రూ. 10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని అన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా చిలకమర్రి రాజేందర్, గౌరవ సలహాదారులుగా పప్పు వెంటక్‌రెడ్డి, మల్లికంటి శంకర్, మండల కన్వీనర్‌గా గాదె శ్రీనివాసాచారి, కో కన్వీనర్‌గా ఈదునూరి రవీందర్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్జల్, కుర్బాన్‌అలీ, హుస్సేన్, ఏడుకొండలు, సంతోష్, శ్రీనివాస్, సుగుణ, రాణి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, సుధాకర్, లింగమ్మ, కృష్ణ, సురేందర్, మొగిలి, వాసుదేవమూర్తి పాల్గొన్నారు.

'చేయూత' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యవకుడు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని పెరిక వీధిలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏటూరునాగారం సీహెచ్‌సీ సహకారంతో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షుడు చిడెం సాయి తేజా పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టగా 20 మంది యవకులు రక్తదానం చేశారు. ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్ రావు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సైన్, సొసైటీ డైరెక్టర్ ప్రకాష్, ఉపసర్పంచ్ ధనలక్ష్మి, బత్తుల రేణుక, చిడెం సాయి ప్రకాష్, చిట్టెం టాకయ్య, వైద్య సిబ్బంది మౌనిక, వైద్యాధికారి మౌనిక, త్రినాథ్ తదితరులు ఉన్నారు.

ఫైసల్ కొట్టు.. పర్మిషన్ పట్టు

- నిబంధనలపై నీళ్లు చల్లుతున్న అధికారులు
- కాంప్లెక్స్ నిర్మాణాల్లో పార్కింగ్, ఫైర్ సేఫ్టీ లేకున్నా అనుమతులు
- రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్న జనం



ఏటూరునాగారంలోని కెనరా బ్యాంక్ ఎదురుగా నిలిపిన వాహనాలు



రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు



ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఏటూరునాగారం: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఏటూరుగారంలో పంచాయతీ అధికారులు నిబంధనలపై నీళ్లు చల్లుతున్నారు. నూతన కాంప్లెక్స్ నిర్మాణాల్లో ఎలాంటి నిబంధనలు పాటించకున్నా అనుమతులు ఇస్తూ ముడుపులు స్వీకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంప్లెక్స్‌ల్లో పార్కింగ్ సదుపాయాలు లేకపోవడంతో వాహనదారులు, రోడ్డుపైనే ఇష్టానుసారంగా వాహనాలను నిలపడంతో ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వై జంక్షన్ నుంచి కూరగాయాల మార్కెట్ వరకు వందలాది నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. మూడేళ్ల కిందట రూ.6 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం జరగడంతో అప్పటి నుంచి కంప్లెక్స్‌ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. కానీ వాటికి కావాల్సిన ఫైర్‌సేఫ్టీ, పార్కింగ్ స్థలాల సౌకర్యాలు, వసతులు కల్పించకుండానే నిర్మాణాలు చకచక సాగుతున్నాయి. నిబంధనలను పాటించని కాంప్లెక్స్ యజమానులపై చర్యలు తీసుకోవాల్సిన గ్రామ పంచాయతీ అధికారులు కమీషన్లు తీసుకొని అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్, విద్యా సంస్థలు ప్రారంభమవడంతో విద్యార్థులు, రైతులుతో పాటు బ్యాంకుల వద్ద వేలాది మంది బారులు తీరుతున్నారు. ఎస్‌బీఐ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు, బస్సు ఆస్పత్రి, కే మార్ట్ తదితర వ్యాపార సంస్థలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కానీ వాటికి సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో వినియోగదారులు, ఖాతాదారులు రోడ్లపై వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ఇతర ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై లారీలు, బస్సులు, ట్రాక్టర్ల రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంటుంది.

ప్రమాదాలు జరిగినా పట్టింపులేదు..

ట్రాఫిక్ సమస్యతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్న అధికారులు స్పందించకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాలుగు నెలల క్రితం ఓ బస్సు ప్రమాదం జరిగిన సంఘటన కూడా మండల ప్రజలకు గుర్తు చేస్తుంది. ఏడాది క్రితం ట్రాక్టర్ కిందపడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఇలా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ స్థానిక పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు. భవన నిర్మాణాలు చేపట్టే వారికి ఫైర్ సెఫ్టీ ప్రొటెక్షన్ తీసుకోవడంతో పాటు వాహనాలకు సరైన పార్కింగ్ స్థలాన్ని కేటాయించి ఉన్న వారికే భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ అనుమతులు ఇవ్వాలని నిబంధనలున్నాయి. కాని క్షేత్రస్థాయి అధికారులు నిబంధనలపై నీళ్లు చల్లుతూ ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.